క్లుప్తంగా

పేదల సొంతింటి కల సీఎం జగన్‌తో సాకారం

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ అన్నారు. అమరావతి ప్రాంతంలో పెద్ద పండుగలా 51 వేల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ కార్యక్రమం చేపట్టడం సీఎం జగన్ కార్యదీక్షకు నిదర్శనమన్నారు. అమరావతిలో పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఇచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇంతటి బృహత్తర కార్యక్రమం నిర్వహించిన సీఎం జగన్‌కు ఇజ్రాయిల్ అభినందనలు తెలిపారు. పట్టాల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం చూశామని, వారి ఆనందానికి అవధులు లేవని తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం దేశ చరిత్రలో సువర్ణాధ్యాయంగా నిలుస్తుందని కొనియాడారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

యానాం: స్థానిక టంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శుక్రవారం వైస్ ప్రిన్సిపాల్ వి.చిత్ర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు దరఖాస్తుతో పాటు పదోతరగతి పాస్ మార్కుల లిస్టు, టీసీ, బ్యాంక్ పాస్ బుక్, రెసిడెన్స్ సర్టిఫికెట్, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం తదితర జిరాక్సులు జత చేయాలన్నారు. దరఖాస్తులు కళాశాలలో అందుబాటులో ఉన్నాయని, పూర్తి చేశాక వచ్చే నెల 9వ తేదీలోగా కళాశాలలో సమర్పించాలని కోరారు.

మహిళా వాకర్స్ క్లబ్ సేవలు



యాచకులకు దుస్తులు, ఆహార పొట్లాలు అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రోడ్ల చెంతన పేదలు, యాచకులు, దివ్యాంగులకు శుక్రవారం అన్న, వస్త్రదానాలు చేశారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకూ ప్రధాన రోడ్డులో ఉన్న పేదలకు మహిళా వాకర్స్ ఆటోలో ఆహార పొట్లాలను తీసుకుని వెళ్లి అందించారు. దీంతో పాటు దుస్తులను బహూకరించారు. మహిళా వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షురాలు భమిడిపాటి పద్మావతి, కార్యదర్శి యర్రమిల్లి అనంతలక్ష్మి, క్లబ్ మాజీ అధ్యక్షురాలు దువ్వూరి సుబ్బలక్ష్మి, పచ్చిగోళ్ల సత్యకుమారి, వాకర్స్ జోన్ చైర్‌పర్సన్ యర్రమిల్లి రామతులసి, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాడిరైతుల కోసమే పాలవెల్లువ



సంగవరంలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ గౌరీకుమారి

ఉప్పలగుప్తం: ప్రభుత్వం పాడి రైతుల కోసం ఏర్పాటు చేసిన జగనన్న పాలవెల్లువ పథకంపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ కేఎస్ గౌరీకుమారి అన్నారు. ఈ పథకంపై మండలంలోని పలు సచివాలయాల్లో శుక్రవారం సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. పాడి పశువులు ఉన్న రైతులను గుర్తించి వారికి ఈ పథకంపై వివరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

తాళ్లరేవు: ఇటీవల పురుగు మందు తాగి కౌలురైతు బొడ్డు గంగాధర్‌రావు మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు కోరారు. శుక్రవారం చొల్లంగిలో బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించారు. కౌలురైతు భార్య వరలక్ష్మి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ సాగులో వరుస నష్టాలు రావడం, పెద్ద కుమార్తె పెళ్లి కుదరడంతో అప్పు పుట్టకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని వాపోయారు.

అందివచ్చిన ఆరోగ్య సేవ

- ముంగిటనే మూగజీవికి వైద్యం
- పాడి రైతుల్లో వెల్లివిరిసిన ఆనందం



ముమ్మిడివరంలో రైతు పొలంలోనే ఆవుకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

ఐ.పోలవరం: మూగ జీవాలకూ వైద్యం దరిచేరింది.. ముంగిటకే అందుబాటులోకి వచ్చింది.. గతంలో గ్రామీణ ప్రాంతాల్లోని పశువులకు అత్యవసర వైద్యం అందాలంటే మండల కేంద్రాల్లోని పశు వైద్యశాలలకు పరుగులు తియాల్సి వచ్చేది. ఇలాంటి సమయంలో కాలయాపన జరిగి పశువులు మృత్యువాత పడేవి. అది గతం. ప్రస్తుత ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ద్వారా 'డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ' అందుబాటులోకి తీసుకువచ్చింది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున సంచార వాహనాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా '1962'కి రైతులు ఫోన్ చేయగానే ఆగమేఘాలపై సంచార వాహనం వస్తోంది. అందులో ఉండే పశువైద్యాధికారి పశువులకు ఉచితంగా చికిత్స చేసి మందులు అందిస్తున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల్లో సుమారు 18 వేలకు పైగా పశువులు ఉన్నట్లు అంచనా. వీటి కోసం ఒక సంచార యూనిట్‌ను అందుబాటులో తెచ్చారు. దీనిద్వారా ఇప్పటి వరకూ వెయ్యి పశువులకు పైగా ఆరోగ్య సేవలు అందించినట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. ప్రతి ఐదు వేల పశువుల యూనిట్‌కు ఒక పశు వైద్యుడు అందుబాటులో ఉండాలని జాతీయ వ్యవసాయ కమిషన్ 1976లో సూచించింది. ఈ ప్రతిపాదన మేరకు తమిళనాడు, గుజరాత్, తెలంగాణ తరహాలో ఈ విధానాన్ని మన రాష్ట్రంలోనూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకువచ్చారు. దీనిద్వారా పాడి రైతుల పశువులకు తమ ఇంటి వద్దే నాణ్యమైన వైద్యం అందిస్తున్నారు. ఈ సదుపాయం అందుబాటులోకి రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అందించే సేవలు ఇవీ..

సంచార పశువైద్య శాలల ద్వారా పశువులకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. పశువు ఉన్నచోటే సత్వరం వ్యాధి నిర్ధారణ చేసి, దానికి అనుగుణంగా నాణ్యమైన వైద్యం అందిస్తారు. దీంతో పాటు పశు వ్యాధుల వ్యాప్తి, నిర్మూలన వంటి అంశాలను అంచనా వేసి దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటారు. కృత్రిమ గర్భోత్పత్తి సేవలు, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడం, పశు యాజమాన్యంపై సూచనలు, సలహాలు అందించి రైతులను చైతన్యం చేయడం, ప్రభుత్వ పథకాలను వివరించడం కూడా ప్రధానమైనవి. నియోజకవర్గంలో ఇప్పటి వరకూ సుమారు వెయ్యి పశువులకు ఈ వాహనం ద్వారా చికిత్స అందించి రైతులకు అవగాహన కల్పించారు. ప్రధానంగా పశువులు ఏటిగట్లపై మేత మేస్తున్నప్పుడు జారి కాళ్లు విరగడం, విషపూరిత ఆహారం తినడం, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే పశువులకు సత్వరం వైద్య సేవలు అందిస్తున్నారు.

శ్రమ తగ్గింది..



మొబైల్ సంచార వాహనం ద్వారా పశువులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నారు. మారుమూల ప్రాంతాలకు చెందిన రైతులకు ఈ వైద్యం ధైర్యాన్నిస్తోంది. ఫోన్ చేయగానే పశువు ఉన్న ప్రాంతానికి వచ్చి అత్యవసర వైద్యం చేస్తున్నారు. గతంలో వైద్యం కోసం పశువులను సుదూర ప్రాంతాలకు తీసుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ శ్రమ తగ్గింది.

–దంగేటి సుబ్బారావు, మురమళ్ల

ఎంతో ప్రయోజనకరం



సంచార వాహనాలు అందుబాటులోకి తీసుకు రావడం చాలా ఆనందంగా ఉంది. దీనివల్ల ఎంతో ప్రయోజనం పొందుతున్నాం. గ్రామీణ ప్రాంతాల రైతులకు ఈ విధానం మేలు చేస్తుంది. పశువులకు ప్రాణాపాయం ఏర్పడినప్పుడు వెటర్నరీ డాక్టర్‌తో పాటు సిబ్బంది అక్కడకు చేరుకుని మెరుగైన వైద్యం అందిస్తున్నారు. దీంతో పాటు ఉచితంగా మందులు ఇస్తున్నారు.

–ఎన్.రామకృష్ణమూర్తి, మురమళ్ల

తక్షణం వైద్య సేవలు



1962కు కాల్ చేయగానే రైతు తమ పేరు, గ్రామం, మండలం, పశువు అనారోగ్య సమస్యను వివరించాలి. ఈ సమాచారం రైతు భరోసా కేంద్రానికి చేరుతుంది. తక్షణం పశు వైద్య సహాయకుడు ఆ ప్రాంతానికి వెళ్లి వైద్య సేవలందిస్తారు. ఇప్పటి వరకూ సుమారు వెయ్యి పశువులకు చికిత్స అందించాం. అవసరమైతే సంచార వాహనంతో అక్కడకు వెళ్లి వ్యాధి నిర్ధారణ చేసి చికిత్స అందిస్తున్నాం. అత్యవసరమైతే పశువును వాహనంలో ప్రాంతీయ పశు వైద్యశాలకు తీసుకువచ్చి ప్రాణాపాయం నుంచి రక్షిస్తున్నాం.

–డాక్టర్ సీహెచ్ నాగపద్మజ, పశువైద్యాధికారి

రేపు విద్యా ఉద్యోగ అవకాశాలపై సదస్సు

అమలాపురం రూరల్: అమలాపురం కిమ్స్ మెడికల్ కాలేజీలో ఉన్నత చదువులపై ఇంటర్ బైపీసీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఈ నెల 28న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ వైద్య అనుబంధ రంగాల్లో విద్యా ఉద్యోగ అవకాశాలపై మార్గదర్శక కెరీర్ ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు కిమ్స్ డీన్ డాక్టర్ ఆనంద్ ఆచార్య తెలిపారు. మెడికల్, డెంటల్, ఫిజియోథెరపీ, నర్సింగ్, పారామెడికల్ డిగ్రీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి అవకాశాలు, అనంతరం ఉద్యోగాల గురించి ఆయా రంగాల్లో నిపుణుల ద్వారా తెలిపి సందేహాలను నివృత్తి చేస్తామని కిమ్స్ ఉపాధ్యక్షుడు మోహనరాజు వివరించారు. మరిన్ని వివరాలకు 73311 85455, 73311 85477 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని కోనసీమ పరిసర ప్రాంతంలో ఇంటర్ బైపీసీ చదివిన విద్యార్థులు వినియోగించుకోవాలని కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణ రాజు, ఎండీ రవికిరణ్‌వర్మ అన్నారు.

వినాయకరావుకు నివాళి

యానాం: స్థానిక కాపు సంఘ నేత, కాపు కల్యాణ మండపం స్థల దాత దివంగత పెద్దిరెడ్డి వినాయకరావు ద్వితీయ వర్ధంతిని శుక్రవారం యానాం తెలగా అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక బైపాస్ రహదారిలో కాపు కల్యాణ మండపంలోని వినాయకరావు కాంస్య విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ అధ్యక్షుడు కాటంశెట్టి వెంకటరామ్మూర్తి, కార్యదర్శి చెక్కల అరుణ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు నల్లా వెంకన్న, గాజుల శ్రీబ్రహ్మానందం, విళ్ల చిన్ని తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహ నిర్మాణ రుణాలు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న శ్రీకాంత్

అల్లవరం: అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు గృహ నిర్మాణానికి ప్రభుత్వం రుణాలను అందిస్తుందని వైఎస్సార్ సీపీ నాయకుడు పినిపే శ్రీకాంత్ అన్నారు. ఎంట్రుకోన పంచాయతీ పరిధిలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలు అందరికీ సక్రమంగా చేరుతున్నాయా లేదా అని శ్రీకాంత్ తెలుసుకున్నారు. నాలుగేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబం పొందిన లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, పార్టీ మండల అధ్యక్షుడు కొనుకు బాపూజీ, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకటరావు, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, సర్పంచ్ తిక్కిరెడ్డి నాగ వెంకట శ్రీనివాసరావు, ఎంపీటీసీ కుంచే చిన సత్యనారాయణ, బీసీ సెల్ అధ్యక్షుడు యల్లమిల్లి బోసు, నాయకులు నార్గన శ్రీను, పాలమూరి సాగర్, వాసర్ల సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రిలే దీక్షలు

ముమ్మిడివరం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు పి.సుబ్బారాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కోనసీమలో ఆరు తాలుకా కేంద్రాలతో పాటు ముమ్మిడివరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమైక్యాంధ్రా శిబిరంలో దీక్షలు చేపడతామన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించండి

అమలాపురం రూరల్: విద్యుత్ చార్జీలు తగ్గించాలని, అప్రకటిత కోతలు ఆపాలని ఈదరపల్లి ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫీస్ వద్ద, కలెక్టరేట్ వద్ద శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకర్ ఆధ్వర్యంలో నిరసనలు జరిగాయి. ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్ఈ కార్యాలయాన్ని అమలాపురంలో ప్రారంభించాలని కోరారు. అనంతరం, కలెక్టర్ హిమాన్షు శుక్లా, విద్యుత్తు శాఖ ఈఈ రవికుమార్‌లకు వినతి పత్రాలు అందజేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి, ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, ముషిణి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ

అమలాపురం టౌన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా మెయిన్ రోడ్డు చెంతన ఓ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద ఇద్దరు మద్యం మత్తులో గురువారం రాత్రి ఘర్షణకు దిగారు. ఈ గలాటాలో ఇద్దరికీ గాయాలయ్యాయి. గాయపడిన వీరిని వారి సంబంధీకులు ఆస్పత్రులకు తరలించి వైద్యం అందించారు. కాకినాడ, రాజమహేంద్రవరంలోని చెరో కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి వారు వైద్యం పొందినట్లు తెలిసింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన ఇద్దరి నుంచి పోలీసులకు శుక్రవారం కూడా ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు ప్రారంభం



స్పోకెన్ ఇంగ్లిష్ తరగతుల ప్రారంభంలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం నాయకులు

అమలాపురం రూరల్: ఏపీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జిల్లా శాఖ, పేరూరు అంబేడ్కర్ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేరూరు తాడిగుంట మెరక కమ్యూనిటీ హాల్‌లో స్పోకెన్ ఇంగ్లిష్ ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించారు. వీటిని సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల నకులరాజు, గోసంగి బంగార్రాజు, స్థానిక అంబేడ్కర్ యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు జల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది వేసవి సెలవుల్లో విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. ఆంగ్లంపై భయాన్ని తొలగించే దిశగా ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం కృషి చేస్తుందని అన్నారు. జిల్లా ఆర్థిక కార్యదర్శి సాధనాల సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి గెడ్డం ప్రదీప్, మాజీ ఎంపీటీసీ ముత్తాబత్తుల వీరవెంకట సత్యనారాయణ, జల్లి శేఖర్, ముత్తాబత్తుల ఆనందరావు, నాగాబత్తుల భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం



తాళ్లరేవు ప్రజా సంఘాల భవనంలో చిన్నారుల కేరింత

తాళ్లరేవు: ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం ఉత్సాహంగా జరుగుతోంది. స్థానిక ప్రజా సంఘాల భవనంలో మూడో రోజు గుత్తుల మల్లేశ్వరరావు, తణుకు రాంబాబు, రమణకుమార్, గోపాలకృష్ణ, పాలిక శ్రీనివాస్ తదితరులు విద్యార్థినీ విద్యార్థులకు వివిధ కార్యక్రమాలను నిర్వహించి ఉత్సాహపరిచారు. కాకినాడ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, అత్తిలి బాబూరావు, పి.ప్రకృతికుమార్, వల్లు రాజబాబుల ఆర్థిక సహాయంతో చిన్నారులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. వీరందరికీ ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

ముమ్మిడివరం: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి వినోద కేంద్రంలో విద్యార్థులు రెండో రోజు శుక్రవారం ఉల్లాసంగా గడిపారు. ముమ్మిడివరం రవీంద్ర ప్రైమరీ స్కూల్లో నిర్వహిస్తున్న ఈ కేంద్రంలో విద్యార్థులకు ఆటలు, పాటలు, మ్యాజిక్ వంటివి నేర్పించారు. మూఢ నమ్మకాలు, మోసాలకు దూరంగా ఉండి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని అన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు జె.సత్యనారాయణ, కోకన్వీనర్ ఎస్.అబ్బులు, బి.బాబూరావు, ఎస్.శ్రీనివాసరావు, కె.రాము తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు వ్యాక్సినేషన్



వీరేశ్వరస్వామి ఆలయం వద్ద వీధి కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యులు, రెడ్‌క్రాస్ సభ్యులు

ఐ.పోలవరం: కుక్కల సంతతి నియంత్రణకు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్‌కు శ్రీకారం చుట్టారు. మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయ ఆవరణలో వీధి కుక్కలకు శుక్రవారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో పశు వైద్యులచే వ్యాక్సిన్ వేశారు. నిత్యం ఆలయానికి వందల మంది భక్తులు వస్తున్నారని, ఇక్కడ వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉన్నట్లు ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, సర్పంచ్ కాశీ రాజుబాబులు రెడ్‌క్రాస్ సొసైటీ దృష్టికి తీసుకు రావడంతో ఈ చర్యలు తీసుకున్నారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ ఢిల్లీ నారాయణ, వైస్ చైర్మన్ పిన్నంరాజు వెంకటసత్తిరాజు, ట్రెజరర్ ముదునూరి సతీష్‌రాజు మాట్లాడుతూ జంతు ప్రేమికులకు ఇబ్బంది లేకుండా, జిల్లాలో ఎవరూ కుక్కకాటుకు బలి కాకూడదనే ఉద్దేశంతో వ్యాక్సినేషన్ చేపడుతున్నామన్నారు. అధికారులు, పంచాయతీ సిబ్బంది, పశు వైద్యాధికారుల సహకారంతో ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. వ్యాక్సినేషన్‌కు దాతల సహకారం కూడా తీసుకుని పెద్దఎత్తున విజయవంతం చేస్తామన్నారు.

సమస్యలు చెబుతున్నా పట్టించుకోరా!

- అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- వాడీవేడిగా మండల పరిషత్ సమావేశం




ఎమ్మెల్సీ సూర్యనారాయణరావును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, ఎంపీపీ భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ శ్రీహరి

అమలాపురం రూరల్: ప్రజల సమస్యలు చెబుతున్నా పట్టించుకోరా.. మండల సమావేశాలకు కూడా హాజరుకారా.. అంటూ అధికారుల తీరుపై సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమావేశాలకు వచ్చే అధికారుల వద్ద పూర్తి సమాచారం ఉండాలన్నారు. దీనిపై ఎంపీడీఓ కాశీ విజయప్రసాద్ దృష్టి పెట్టాలని అన్నారు. తాండవపల్లి ఎంపీటీసీ సభ్యుడు రేవు శ్రీనుబాబు మాట్లాడుతూ తమ గ్రామంలో డ్రైన్ సమస్యను పరిష్కరించాలంటూ ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు. దాంతో డ్రైన్స్ ఏఈ సునీతాదేవి సమాధానం ఇస్తూ నిధులు మంజూరు కాలేదన్నారు. జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్ మాట్లాడుతూ వాసాలతిప్ప డ్రైన్ ఆక్రమణలకు గురవుతుందని, ఆక్వా వ్యర్థాలను డ్రైన్‌లోకి వదిలేస్తున్నారని అన్నారు. వారికి నోటీసులు ఇచ్చామని ఏఈ చెప్పారు. మండల విద్యాశాఖ అధికారి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ విషయం ప్రజలకు తెలుసా అంటూ సర్పంచులు గుత్తుల చిరంజీవిరావు, పెనుమాల సునీత, ఎంపీటీసీ రేవు ప్రశ్నించారు. ఆ విషయం చెప్పేందుకు ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు ఉన్నారని ఎంఈఓ చెప్పారు. సాకుర్రు హైస్కూల్లో హెచ్ఎం పోస్టు తీసేశారంటూ సాకుర్రు సర్పంచ్ చిరంజీవిరావు మండిపడ్డారు. దాత విరాళంగా ఇచ్చిన స్థలంలో పాఠశాల నిర్మిస్తే ఎందుకు సదుపాయాలు కల్పించడం లేదంటూ నిలదీశారు. తమ గ్రామంలో లైన్‌మైన్ పోస్టు లేదని ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా స్పందన లేదంటూ చిందాడగరువు సర్పంచ్ పోణకల గణేష్ అన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా వచ్చిన జేఎల్ఎం కూడా తమ మాటను లెక్కచేయడం లేదంటూ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎంపీపీ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని సబ్ ఇంజినీర్‌ను నిలదీశారు. భట్నవిల్లిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సర్పంచ్ తిరికోటి సుజాత తెలిపారు. ఇమ్మిడివర్పాడులో సచివాలయం లేక తాండపల్లి వెళ్లాల్సి వస్తుందని సర్పంచ్ రేలంగి దుర్గారావు తెలిపారు. తొలుత ఇటీవల ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టిన కుడుపూడి సూర్యనారాయణరావును ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, అడపా సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ విజయప్రసాద్, సర్పంచులు చెల్లుబోయిన వెంకటేశ్వరరావు, రేలంగి దుర్గారావు తదితరులు సత్కరించారు.

తెలుగుపై పట్టు సాధించాలి

అంబాజీపేట: చిన్నతనం నుంచి తెలుగుపై పట్టు సాధించాలని జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో తెలుగు భాష విశిష్టతను విద్యార్థులకు వివరించారు. తెలుగులో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

సివిల్స్ విజేతకు అభినందనలు



లక్ష్మీరమణిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరీదేవి

మామిడికుదురు: సివిల్స్‌లో సత్తా చాటిన యర్రంశెట్టి ఉమాశ్రీలక్ష్మీరమణిని శుక్రవారం ఈదరాడలో ఆమె స్వగృహంలో కలిసి పలువురు అభినందించారు. మాజీ ఎమ్మెల్యేలు పాముల రాజేశ్వరీదేవి, మానేపల్లి అయ్యాజీ వేమా పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించారు. సివిల్ సర్వీసు పరీక్షల్లో ఆల్ ఇండియా స్థాయిలో 583 వ ర్యాంకు సాధించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. నగరం ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్ముల కొండలరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

బాలాజీ కల్యాణానికి ఆహ్వానం

మామిడికుదురు: ఈ నెల 31వ తేదీ రాత్రి 9.15 గంటలకు జ్యేష్ఠ శుద్ధ ఏకాదశిన జరిగే అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి కల్యాణోత్సవానికి రావాలని కోరుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులకు శుక్రవారం ఆహ్వానాలు అందించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, బీసీ సంక్షేమ శాఖా మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ, కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ ధ్యానచంద్ర, ఎస్పీ శ్రీధర్, ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావులను ఆహ్వానించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సహాయ కమిషనరు డి.శ్రీరామవరప్రసాదరావు, ట్రస్టుబోర్డు సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పునాదులు

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పథకాలతో రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి పునాదులు వేసిందని, దీని కోసం సగర్వంగా చెప్పేందుకు మీ ముందుకు వచ్చానని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గంగలకుర్రులో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏ ఇంట్లో ఏ పథకాల ద్వారా ఎంతమేర లబ్ధి చేకూరిందో తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా బలపర్చాలన్నారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ గ్రామంలో రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని త్వరలో నిర్మాణాలు చేపడతామన్నారు. ప్రతీ ఇంటికి రూ.40 వేల నుంచి గరిష్ఠంగా రూ.2.6 లక్షల వరకు వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు నెల్లి పండు, సొసైటీ అధ్యక్షుడు మట్టపర్తి చంద్రశేఖర్, దొమ్మేటి సత్యమోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు పాల్గొన్నారు.